బహుళ ప్రయోజన గుర్తింపు కార్డులు అందజేత



ఐడీ కార్డులు అందజేస్తున్న వీసీ వీఎస్‌కేరెడ్డి, బ్యాంకు ప్రతినిధులు

మేడ్చల్‌ రూరల్‌: పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ యూనివర్సిటీ విద్యార్థులకు ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో రూపొందించిన చిప్‌ ఉన్న గుర్తింపు కార్డులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌ చాన్సలర్‌ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌ఎఫ్‌ఐడీ సాంకేతిక పరిజ్ఞానంతో పని చేస్తుందని, డెబిట్‌ కార్డుగా ఏటా రూ. 5 లక్షల పరిమితి లోపు నగదు లావాదేవీలు, ట్యూషన్‌, పరీక్ష రుసుము చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ఆంజనేయులు, హెచ్‌ఓడీ సుజిత్‌, బ్యాంకు ప్రతినిధులు రాహుల్‌, శివ పాలపర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఏలు చెల్లించాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తపస్‌ నాయకులు

మేడ్చల్‌: రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువు భత్యం) వెంటనే విడుదల చేయాలని కోరుతూ తపస్‌ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ శైలజకు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్‌ కార్యాలయంలో తపస్‌ నాయకులు తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేసి తమ విన్నపాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి తెలియజేయాలని కోరారు. డీఏ పెండింగ్‌ నిధులతో పాటు కుబేర్‌లో పెండింగ్‌ బిల్లులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో తపస్‌ నాయకులు నవీన్‌, గోపాల్‌, వెంకటరమణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల వారోత్సవ ర్యాలీ



కీసర: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నాగారంలో కీసర పోలీసులు నిర్వహించిన ర్యాలీలో సెరినిటీ స్కూల్‌ విద్యార్థులు పాల్గొని అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సెక్టార్‌ ఎస్‌.ఐ నాగరాజు, సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్‌ నోముల జంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడిగా చీర వినోద్‌



కీసర: కీసర మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులుగా చీర వినోద్‌ నియమితుడయ్యాడు. ఈ మేరకు సోమవారం మేడ్చల్‌ జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా చీర వినోద్‌ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఉద్యమకారుల ఫోరం అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్‌(సీనన్న), జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బోడ జంగయ్య, శ్రీనివాస్‌, నవీన్‌, రవి, యాదిరెడ్డి, సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

మజిల్స్‌ మానియ విజేత శంకర్‌సింగ్‌



మేడ్చల్‌: బెంగుళూరులో నిర్వహించిన రీజినల్‌ మజిల్‌ మానియా చాంపియన్‌ షిప్‌ విజేతగా మేడ్చల్‌కు చెందిన జిమ్‌ కోచ్‌ శంకర్‌ సింగ్‌ నిలిచారు. చాంపియన్‌ షిప్‌లో అత్యుత్తమ ప్రదర్శన నిర్వహించి శంకర్‌సింగ్‌ మొదటి స్థానంలో నిలిచాడు. కోచ్‌కు మేడ్చల్‌లో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ఉప్పల్‌: బీరప్పగడ్డ వెస్ట్‌ కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో చైల్డ్‌ సురక్ష ఫౌండేషన్‌ సహకారంతో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానికులు పెద్దఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారని నిర్వాహకులు తెలిపారు. అవసరమైన వారికి సలహాలు ఇచ్చారన్నారు.

మానవ హక్కులపై అవగాహన

మౌలాలి: వినాయక్‌నగర్‌ డివిజన్‌ శివసాయినగర్‌లోని కార్యాలయంలో తెలంగాణ స్టేట్‌ హ్యూమన్‌రైట్స్‌ గురించి అందరికీ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్యాలయాన్ని మానవ హక్కుల జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్‌ అయ్యప్ప సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా ముందుకెళ్తున్నామన్నారు. నేతలు మోమిన్‌, బాషా, నంద్యాల కృష్ణ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోకప్‌లో విద్యార్థుల ప్రతిభ

ఉప్పల్‌: చైనాలో నిర్వహించిన రోబోకప్‌ జూనియర్‌ ఆసియా పసిఫిక్‌కప్‌లో ఉప్పల్‌ లిటిల్‌ ఫ్లవర్‌ పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అక్టోబర్‌ 24 నుంచి 27 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో పదోతరగతికి చెందిన అమన్‌ విశ్వక్‌, తొమ్మిదో తరగతి విద్యార్థి మనీష్‌లు అండర్‌- 19 జూనియర్‌ విభాగంలో మూడో స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల ప్రిన్సిపాల్‌ బ్రదర్‌ జోసెఫ్‌ అభినందించారు.

కార్తీకమాసోత్సవ పూజలకు

ముస్తాబవుతున్న కీసరగుట్ట

◆ నవంబరు 2 నుంచి డిసెంబర్‌ 1వ తేదీ వరకు పూజలు ◆ భక్తుల కోసం తగు ఏర్పాట్లు : ఆలయ చైర్మన్‌

కీసర: తెలంగాణలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నవంబర్‌ 2 నుంచి డిసెంబర్‌ 1వ తేది వరకు నెలరోజుల పాటు కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్‌ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్తీక మాసోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కీసరగుట్టకు తరలివస్తారని, ఈ మేరకు భక్తుల కోసం దేవస్థానం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరుగుతోందన్నారు. క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాలు, భక్తులు కార్తీక వనభోజనాలు చేసుకునేందుకు ఏర్పాట్లు, గర్భాలయంలో కొలువైన స్వామివారికి వివిధ అభిషేక పూజల కోసం తదితర ఏర్పాట్లు పూర్తిచేయడం జరుగుతుందన్నారు.



కీసరగుట్ట ఆలయం

నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల వివరాలు

కార్తీక మాసోత్సవాల మొదటి రోజైన నవంబర్‌ 2న దేవాలయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గర్భాలయంలో కొలువైన స్వామివారికి (శివలింగానికి) క్షీరాభిషేకం, 3న సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపోత్సవం, క్షీరాభిషేకం పూజలు, 4న సోమవారం నానావిధ ఫల రసాభిషేకం, 5న నాగుల చవితి, నాగదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు, 7న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, 10న స్వామివారికి పంచామృతాభిషేకం, 11న స్వామివారికి గంధాభిషేకం, 12న సత్యనారాయణ స్వామి వ్రతాలు, 13న క్షీరాబ్ధి ద్వాదశి (తులసిపూజ), 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా నానా విధ పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణం, మహాలింగ దీపోత్సవం, 17న నానా విధ పత్రిపూజ, 18న భస్మాభిషేకం, 19న భవాని శివదుర్గాసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం, 24న ఇక్షురసాభిషేకం(చెరుకు), 25న విశేష పంచామృత మరియు ఫల రసాభిషేకములు, 26న సత్యనారాయణ వ్రతములు, 29న మాస శివ రాత్రి యథాశక్తి బిల్వార్చన, రుద్రహోమము, 30న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం, డిసెంబర్‌ 1న అమావాస్య సందర్భంగా తైలాభిషేకం, అన్నాభిషేకం పూజలతో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయన్నారు.

చెత్త సేకరణపై నిర్లక్ష్యం ఎలా..!

● తడి, పొడి సేకరణలో నెరవేరని లక్ష్యం
● పట్టించుకోని మున్సిపల్‌ కమిషనర్లు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతి రోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో 29 పురపాలక సంఘాలు ఉండగా, రోజూ లక్షకు పైగా జనాభా కలిగిన పురపాలికలో దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. పురపాలికల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాల్సి ఉన్నా.. ఎక్కడా సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకొని తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవటం లేదని తెలుస్తోంది.

సమయానికి రాక.. రోడ్లపైనే పారబోత..

చెత్తను తరలించే వాహనాలు వార్డులు /డివిజన్లకు సమయానికి రాకపోవడంతో పురపాలికల్లో పలు చోట్ల చెత్తను రోడ్ల పక్కన పారబోస్తున్నారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్త విభజన జరగడం లేదు. ప్రతి వార్డు/డివిజన్‌కు వాహనంతోపాటు సిబ్బందిని కేటాయించినా.. సేకరణ విషయంలో అలసత్వం వహిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తేనే స్పందన

పురపాలికల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తడి, పొడి చెత్త సేకరణ అమలు కావడం లేదు. వార్డు అధికారులు చెత్త సేకరణను నిత్యం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప స్పందించటం లేదని తెలుస్తోంది. కొన్ని వార్డుల్లో రెండు, మూడు రోజులకోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేది లేక కాలనీలో రోడ్ల వెంట పారబోస్తున్నారు. దీంతో తడి, పొడి చెత్త సేకరణ అమలుకు పునాది పడటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అవగాహన పరిచి తడి, పొడి చెత్త సేకరణ జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

దృష్టికి వస్తే...

పురపాలికల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం లేదనే విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదని సంబంధిత మున్సిపల్‌ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణాల్లో వార్డుల వారీగా పరిశీలించి తడి, పొడి చెత్తను వేరుచేసి సేకరించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. పట్టణ ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణలో జరుగుతున్న జాప్యాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆర్డీఓగా సైదులు

కీసర: కీసర రెవెన్యూ డివిజనల్‌ అధికారిగా (ఆర్డీవో)గా సైదులు నియమితులయ్యారు. ఇప్పటి వరకు కీసర ఆర్డీవోగా విధులు నిర్వహించిన వెంకట ఉపేందర్‌రెడ్డి, సిరిసిల్లా జిల్లాకు బదిలీపై వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

శ్మశానవాటిక వద్ద ఆక్రమణలను తొలగించాలని వినతి



మేడ్చల్‌: పట్టణంలోని ముస్లిం శ్మశానవాటిక వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన వ్యాపార డబ్బాలను, వ్యాపార దుకాణాలను తొలగించాలని పట్టణ ముస్లింలు మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు ముస్లిం నాయకులు మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవించి అక్రమాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ



కీసర: నాగారం మున్సిపల్‌ నూతన కమిషనర్‌గా భాస్కర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, మేనేజర్‌ చంద్రోశేఖర్‌, కౌన్సిలర్‌ పంగహరిబాబు తదితరులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్‌ కమిషనర్‌ భాస్కర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరం

అల్వాల్‌: పోలీస్‌ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నేరేడ్‌మెట్‌ పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్‌ క్యాంపు శిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి జోన్‌ డీసీపీ పీ.వీ.పద్మజ ఐపీఎస్‌, కుషాయిగూడ డివిజన్‌ ఏసీపీ మహేష్‌ కుమార్‌గౌడ్‌, నేరెడ్‌మెట్‌ ఇన్‌స్పెక్టర్‌ సందీప్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి యువత, పోలీస్‌ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన పోలీస్‌ సిబ్బంది, ప్రజలకు డీసీపీ పద్మజ ప్రశంసాపత్రాలను అందజేశారు.

ప్రజా వినతులపై తక్షణమే స్పందించాలి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 71 ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌ పోర్టల్‌లో అప్‌లోడ్‌ చేయాలని అదనపు కలెక్టర్‌ సూచించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులకు ఆయన సూచించారు. ఇందులో డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బీటెక్‌ విద్యార్థి మృతి

ఘట్‌కేసర్‌: ఆర్థిక సమస్యల కారణంగా ఓ ఇంజనీరింగ్‌ విద్యార్థి గుర్తు తెలియని పురుగుల మందు సేవించి ఘట్‌కేసర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ పరశురాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌ జిల్లా వర్ధన్నపేట మండలం, కడారిగూడెంకు చెందిన గణేష్‌ (22) రాంపల్లిలో తన స్నేహితులతో ఉంటు స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్‌ మూడో సంవత్సరం చదువుతున్నాడు. దసరా పండుగకు ఇంటికి వెళ్లి మరుసటి రోజు హైదరాబాద్‌కు వచ్చాడు. ఈ నెల 23న ఘట్‌కేసర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో పురుగుల మందు సేవించాడని గణేష్‌ మిత్రుడు అతడి తల్లికి తెలిపాడు. అనంతరం చికిత్స కోసం



మృతుడు గణేష్‌ (ఫైల్‌)

గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గణేష్‌ ఆన్‌లైన్‌ గేమ్‌లు ఆడేవాడని, స్నేహితుల వద్ద అప్పుల చేశాడని, అప్పులు చెల్లించలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్‌ మానసిక దివ్యాంగుల స్కూల్‌ ఫౌండర్‌ డాక్టర్‌ రామ్‌ వృద్ధులకు చేయూతనందించారు. ఈ సందర్భంగా సోమవారం బీజేఆర్‌నగర్‌, వాజ్‌పేయినగర్‌, ఎల్లారెడ్డిగూడ, మధురానగర్‌కు చెందిన పలువురు వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌బీఐ మేనేజర్‌ ప్రీతిగ్రేస్‌ మాట్లాడుతూ.. వృద్ధుల కోసం అనురాగ్‌ స్కూల్‌ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. సింగరేణి మాజీ ఉద్యోగి రామచంద్రమూర్తి, గోపిరెడ్డి, బిందు, స్కూల్‌ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు, వినతులను సత్వరం పరిష్కరించడమే ధ్యేయంగా అధికారులు దృష్టి సారించి పనులను వేగవంతం చేయాలని మేయర్‌ అమర్‌ సింగ్‌ అధికారులను ఆదేశించారు. పీర్జాదిగూడ మున్సిపల్‌ కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, డిప్యూటీ ఇంజినీర్‌ సాయినాథ్‌గౌడ్‌, రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహప్రతిష్ఠ మహోత్సవం



కీసర: నాగారం మున్సిపాలిటీలోని రాజ్‌సుఖ్‌నగర్‌ కాలనీలో నల్లపోచమ్మ, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో సోమవారం ఎంపీ ఈటల రాజేందర్‌, మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి, కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కోసం రూ. 5.4కోట్ల నిధులు



మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ప్రణీతా శ్రీకాంత్‌గౌడ్‌ అన్నారు. సోమవారం నిర్వహించిన మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్‌ పరిధిలోని 18 వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు మున్సిపల్‌ సాధారణ నిధుల నుంచి ఒక్కో వార్డుకు రూ. 30 లక్షల చొప్పున మొత్తం 5.4 కోట్ల నిధులను వెచ్చించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. దీంతో పాటు, రోడ్డు వెడల్పులో మున్సిపల్‌ కార్యాలయం తొలగించాల్సి వస్తుందని, కొత్త మున్సిపల్‌ భవనం నిర్మించేందుకు రూ. 2.5 కోట్ల నిధులను వెచ్చించాలని, 18 వార్డుల్లో మంచినీటి సరఫరా మోటర్ల రిపేర్ల కోసం రూ. 10 లక్షలు, విలీన గ్రామాల్లో మంచి నీటి సరఫరా నిర్వహణ కోసం రూ. 17 లక్షలు, హరితహారం కోసం రూ. 5 లక్షలు వెచ్చించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో కమిషనర్‌ నాగమణి, వైస్‌చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి, మేనేజర్‌, టీపీఎస్‌ శ్రీదేవి, డీ.ఈ.ఈ బాల మురళి, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెడిసిటీ క్లినిక్‌లు ప్రారంభం

మేడ్చల్‌ రూరల్‌: రావల్‌కోల్‌, అక్బర్జాపేట్‌లో మెడిసిటీ ఆధ్వర్యంలో సోమవారం నూతనంగా క్లినిక్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సీఈఓ దినేష్‌, సీఏఓ సత్యంరెడ్డి మాట్లాడుతూ.. మెడిసిటీ ఆసుపత్రికి రాలేని వారు స్థానిక క్లినిక్‌లో వైద్యం పొందొచ్చన్నారు. క్లినిక్‌లో బీపీ, షుగర్‌, కంటి పరీక్షలతో పాటు ముక్కు, గొంతు, బీజుకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్‌ గడ్డలు, గర్భసంచి సంబంధ సమస్యలు, మోకాళ్లు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలకు ఉచిత పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. టెస్టులు, ఆపరేషన్‌ అవసరం ఉన్నవారికి మెడిసిటీ ఆసుపత్రిలో వైద్యం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ ఎంపీపీ వెంకటేష్‌, మాజీ సర్పంచులు మహేందర్‌ ముదిరాజ్‌, రాములుగౌడ్‌, మాజీ ఎంపీటీసీ అంకిత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌ విజేతలకు బహుమతులు ప్రదానం

మేడ్చల్‌ రూరల్‌: పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో నిర్వహించిన 36 గంటల హ్యాకథాన్‌ సోమవారం ఘనంగా ముగిసింది. వీఎస్‌ఆర్‌ వీజేఐటీ విద్యార్థులు ప్రథమ, ఐఐటీ మద్రాస్‌, హైదరాబాద్‌ కేఎల్‌ విశ్వవిద్యాలయం ద్వితీయ, నర్సింహారెడ్డి ,సీఎంఆర్‌ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలువగా రూ. 30, రూ. 20 వేల నగదు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ.. హ్యాకథాన్‌తో విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకునే అవకాశం లభిస్తుందన్నారు.



కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ లోకనాథం, హెచ్‌ఓడీ రాము, సమన్వయ కర్త దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ నూతన కమిషనర్‌గా చంద్రశేఖర్‌



ఘట్‌కేసర్‌: మున్సిపల్‌ నూతన కమిషనర్‌గా బొందుగుల చంద్రశేఖర్‌గుప్తా సోమవారం బాధ్యత స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా విధులు నిర్వహించిన సాబేర్‌ అలీ నిజాంపేట్‌కు బదిలీ కాగా, మీర్‌పేట్‌ కమిషనర్‌ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌ మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా కృషి చేస్తానని, మున్సిపల్‌ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిల్‌ సభ్యులు ఆంజనేయులు గౌడ్‌, వెంకట్‌రెడ్డి, రమాదేవి, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో చైర్‌పర్సన్‌ పర్యటన



ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలోని ఎదులాబాద్‌, మర్పల్లిగూడలో మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య సోమవారం పర్యటించారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, విధుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ.. ఏమైన సమస్యలు ఉంటే కౌన్సిల్‌ సభ్యులకు, మున్సిపల్‌ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో శానిటేషన్‌ ఇన్‌చార్జి శ్రీనివాస్‌, జంగయ్యయాదవ్‌, రవి, మున్సిపల్‌ కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

మనో వికాసానికి కూచిపూడి తోడ్పాటు

అల్వాల్‌: నృత్య మయూరి కళానికేతన్‌ కూచిపూడి నృత్యోత్సవం సోమవారం అల్వాల్‌ డివిజన్‌ వేణుగోపాల్‌నగర్‌ కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ప్లానింగ్‌ బోర్డు వైస్‌ చైర్మన్‌ చిన్నారెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ హాజరయ్యారు. ఈ సందర్భంగా గురు జయంతి నారాయణ ఆధ్వర్యంలో చెంచులక్ష్మి కూచిపూడి బాలెట్‌ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కూచిపూడి గ్రామంలో పుట్టిన కూచిపూడి నాట్యం మనో వికాసానికి తోడ్పాటు అవుతుందన్నారు. కార్పొరేటర్‌ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సరస్వతీదేవి ఉపాసకులు మంగళగిరి నరసింహమూర్తి, గురు నీరజాదేవి, డాక్టర్‌ వేదాంతం, వెంకటనాగ చలపతిరావు, రవీందర్‌, డిప్యూటీ డైరెక్టర్‌ రఘునందన్‌ తదితరులు పాల్గొన్నారు.